వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.49 కోట్లు

- బంగారం 28 గ్రాములు, వెండి 2.180 కిలోలు
- ఏడు దేశాల కరెన్సీ లభ్యం

6

- వెల్లడించిన ఉప కమిషనరు, ఈవో

ప్రపంచవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందిన ప్రధాని మోదీ

- పుట్టినరోజు వేడుకల్లో నేతలు
- బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు

అమలాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ సామాన్య కుటుంబం నుంచి ఎదిగి నేడు దేశ సేవకు అంకితమై ప్రపంచవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందగలుగుతున్నారని లోక్‌సభ టీడీపీ విప్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా అమలాపురం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో బుధవారం జరిగిన వేడుకల్లో ఎంపీ హరీష్‌మాధుర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీతోపాటు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించగా కంటి వైద్యశిబిరాన్ని ఎంపీ హరీష్ బాలయోగి ప్రారంభించారు. ఈసీజీ విభాగాన్ని అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, బీజేపీ అధికార ప్రతినిధి పవన్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం పార్టీ శ్రేణుల సమక్షంలో ప్రధాని పుట్టినరోజు సందర్భంగా ఎంపీ కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. దేశవ్యాప్తంగా కొన్ని వస్తువులపై జీఎస్టీ తగ్గించిన ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయినన నిండు నూరేళ్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, దేశ ప్రజలకు మరిన్ని సేవలు చేసి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షిస్తూ వక్తలు మాట్లాడారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో తీసుకువచ్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలు ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు అయ్యల బాషా, మాజీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు, చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, టీడీపీ మహిళా నేత పెచ్చెట్టి విజయలక్ష్మి, జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, నల్లా అజయ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకురుమెల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నల్లా పవన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.



అమలాపురంలో ప్రధాని పుట్టినరోజు వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు, పాల్గొన్న ఎంపీ హరీష్, బీజేపీ నేతలు



విశ్వకర్మకు నివాళులర్పిస్తున్న జేసీ నిషాంతి

కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి

- నివాళులర్పించిన జేసీ

అమలాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో కలెక్టర్ కార్యాలయంలో బుధవారం బీసీ సంక్షేమశాఖ, విశ్వబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. జేసీ టి.నిషాంతి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి పనికి విశ్వకర్మ ప్రేరణ ఉందని, స్ఫూర్తి ప్రదాత విశ్వకర్మ మహరుషి చూపిన మార్గాన్ని అనుసరించాలన్నారు. వాస్తుశిల్పి, యంత్ర పరికరాల ఆవిష్కరణలతో ప్రపంచ శిల్పిగా విశ్వకర్మ పేరు గాంచారన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ప్రేరణగా నిలిచే ఆయన స్ఫూర్తి సమాజంలో నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని కోరారు. ఆయనకు సంబంధించిన అనేక అంశాలను ఆమె ప్రస్తావించారు. ప్రధాని నరేంద్రమోదీకి కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మాధవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పి.జ్యోతిలక్ష్మిదేవి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, పెద్దలు ఎ.వేణుగోపాల్, పి.చిదంబరాచారి, మణిశ్రీకాంత్, వి.సత్యనారాయణ, టి.వెంకటరమణ, బి.ప్రకాష్, కె.రమణ పాల్గొన్నారు.

రేపు కొత్త టీచర్లకు నియామక పత్రాల జారీ 7



- నేటినుంచి శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభం
- హాజరు కానున్న మంత్రి సుభాష్, ప్రభుత్వ విప్ దాట్ల, ఎమ్మెల్యేలు
- జిల్లాలో కీలక సమస్యలే లక్ష్యంగా చేసుకుని అసెంబ్లీలో ప్రస్తావిస్తాం
- యూరియాపై వైసీపీ దుష్ప్రచారాన్ని అసెంబ్లీ వేదికగా తిప్పి కొడతాం: ఎమ్మెల్యేలు

అమలాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం నుంచి అమరావతిలో అసెంబ్లీ, శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లానుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజుతో పాటు ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావులతోపాటు జనసేనకు చెందిన ఎమ్మెల్యేలు దేవవరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అసెంబ్లీ సమావేశాల వేదికగా చర్చించడానికి ఎమ్మెల్యేలు సమాయత్తమయ్యారు. ఇటీవల వైసీపీ యూరియా కొరతపై చేసిన ఆందోళన నేపథ్యంలో రైతుల సంక్షేమంకోసం ప్రభుత్వం చేస్తున్న పథకాలతోపాటు యూరియా కొరత ఎక్కడ ఉందంటూ వైసీపీ ఎమ్మెల్యేలపై టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు తిరుగుబాటుకు సిద్ధం కానున్నారు. వీటితోపాటు ప్రస్తుతం ఉన్న కీలక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే లక్ష్యంతో వర్షాకాల సమావేశాలను వేదికగా చేసుకుంటామని ఎమ్మెల్యేలు ప్రకటిస్తున్నారు. ప్రభుత్వవిప్‌గా ఉన్న దాట్ల సుబ్బరాజు ప్రజలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలు గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు వినతిపత్రాలు సిద్ధం చేసి స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి అందించడానికి చర్యలు చేపట్టారు. నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను తాము వర్షాకాల సమావేశాల్లో ప్రస్తావిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, జనసేనకు చెందిన గిడ్డి సత్యనారాయణ వెల్లడించారు.

కూనవరం స్ట్రయిట్ కట్‌ను పునరుద్ధరించాలి

- అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం ఎమ్మెల్యే, టీడీపీ

జిల్లాలో నాలుగు ప్రధాననియోజకవర్గాలకు చెందిన రైతులు ఎదుర్కొంటున్న ముంపు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోరేందుకు సిద్ధంగా ఉన్నాను. జిల్లాల విభజన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బాగా వెనుకబడినదిగా మారింది.ఇక్కడ పరిశ్రమల స్థాపనతోపాటు గ్యాస్ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు జిల్లాకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చాలి. కూనవరం స్ట్రయిట్‌కట్ పునరుద్ధరణతోపాటు కబ్జాకు గురైన భూములను సర్వేచేసి గుర్తించి ఆక్రమణలు తొలగించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తా. జిల్లా ఏర్పడిన దృష్ట్యా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలనేది శాసనసభలో ప్రస్తావిస్తాం.

గోదావరి కోత నిరోధానికి రివిట్‌మెంట్ చేయాలి

- గిడ్డి సత్యనారాయణ, పి.గన్నవరం ఎమ్మెల్యే, జనసేన

ఇటీవల కాలంలో తరచూ సంభవిస్తున్న గోదావరి వరదలకు నదీ తీర పరీవాహక భూములు తీవ్రంగా కోతకు గురవుతున్నాయి. దీంతో లంక గ్రామాల రైతులు నష్టపోతున్నారు. వీరిని ఆదుకునేందుకు రివిట్‌మెంట్ పనులు చేపట్టడంతోపాటు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరుతాం. అంబాజీపేటలోని వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని అభివృద్ధి చేయడంతోపాటు కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడంద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి. వివిధ ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని వర్షాకాల సమావేశాల వేదికగా కోరనున్నాం.



- మద్యం నూతన బార్ పాలసీకి మరోసారి నిర్వాహకుల షాక్
- జిల్లాలో 8 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం
- అమలాపురంలో గీత కార్మికుల పేరిట బార్‌కు 4 దరఖాస్తులు
- అదీ అమలాపురం మున్సిపాలిటీ నుంచే..
- నేడు కలెక్టరేట్‌లో లక్కీడ్రా
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నిల్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

నూతన ఎక్సైజ్ బార్ పాలసీ 2025-28 సంవత్సరానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మద్యం బార్ల పాలసీకి 'బార్ నిర్వాహకులు రెండోసారి ఝలక్ ఇచ్చేశారు. ప్రభుత్వం పెట్టిన నూతన పాలసీలోని ఆంక్షలను తట్టుకోలేని నిర్వాహకులు లైసెన్సుల కోసం ఎవరూ దరఖాస్తు చేయలేని పరిస్థితి జిల్లాలో మరోసారి ఉత్పన్నమైంది. దీంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వాస్తవానికి గతనెల 29వతేదీకి బార్ల దరఖాస్తు గడువు ముగిసినా నిర్వాహకుల నుంచి స్పందన కరువైంది. అప్పట్లో జిల్లా పరిధిలో అమలాపురం పురపాలక సంఘంలోని ఒకే ఒక్క బార్‌కు మాత్రం నాలుగు దరఖాస్తులతో లక్కీడ్రాలో అమలాపురం పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు అల్లాడ శరత్‌కుమార్ కైవసం చేసుకున్నారు. ప్రభుత్వం రెండోసారి నోటిఫికేషన్ జారీచేసి బుధవారం సాయంత్రంతో గడువు ముగించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుతో జిల్లాలోని ఎనిమిది బార్లకు ఒక్కరు కూడా దరఖాస్తు చేయలేదు. కానీ గీత కార్మికుల కోటాలో జిల్లాలోని రామచంద్రపురం 1, అమలాపురానికి 1 ప్రభుత్వం రాయితీతో దరఖాస్తులకు ఆహ్వానించింది. దీనిలోభాగంగా రెండోసారి అమలాపురం పురపాలక సంఘంలో గీత కార్మికుల పేరిట బార్ కోసం నాలుగు దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లో దాఖలు అయినట్టు ఎక్సైజ్‌శాఖ అధికారులు ప్రకటించారు. జిల్లాలో ఆన్‌లైన్‌లో ఎనిమిది బార్లకు, రెండు గీతకార్మికుల పేరిట మంజూరైన బార్లకు దరఖాస్తులు దాఖలు కాలేదని అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇన్‌చార్జి రేణుక తెలిపారు. బార్ నిర్వాహకులెవరూ ముందుకు రాకపోవడానికి నూతన ఎక్సైజ్ పాలసీలో ప్రభుత్వ నిబంధనలే కారణంగా ఎక్సైజ్‌శాఖ అధికారులతోపాటు బార్ నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికే మద్యం బార్ల వ్యాపారంలో నష్టాలు చవిచూస్తున్నామని, ప్రస్తుత ప్రభుత్వం నూతన ఎక్సైజ్ బార్‌పాలసీ పేరిట ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు దాఖలు చేయాలనే నిబంధన బార్ యజమానులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. దీంతో ఎవరూ రెండోసారి టెండర్ల దాఖలుకు ముందుకు రాలేదు. మొదటిసారి ఒకే ఒకరు బార్‌కు అర్హత సాధించి మిగిలిన వారు దరఖాస్తులు చేయకపోవడంతో అప్పట్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ప్రసాద్‌పై ప్రభుత్వం ఆకస్మిక బదిలీ వేటువేసింది. రెండోసారి కూడా గీతకార్మికుల మద్యం బారుకు తప్ప మిగిలిన బార్లకు దరఖాస్తులురాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మూడోసారినోటిఫి కేషన్ జారీకి అవకాశాలున్నాయంటున్నారు.

రూ.1.25కోట్లతో డార్మిటరీ నిర్మాణం

- రుడా, ఉపాధి నిధులతో ఏటిగట్టు రహదారి అభివృద్ధికి చర్యలు
- వాడపల్లి వెంకన్న ఆలయంలో వివిధ పనులపై ఎమ్మెల్యే బండారు సమీక్ష



ఆలయంలో అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

ఆత్రేయపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలయంలో వివిధ అభివృద్ధి పనులపై బుధవారం ఆయన సమీక్షించారు. రూ.1.25కోట్లతో డార్మిటరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. రుడా, ఉపాధి నిధులతో వాడపల్లి నుంచి రావులపాలెం వరకూ ఏటిగట్టును అభివృద్ధిచేసి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. వకుళమాత అన్నదాన భవనాన్ని త్వరలోనే వినియోగంలోకి తెస్తామని,ఈ భవనంలో సెంట్రలైజ్డ్ కిచెన్, డైనింగ్ మెటరీయల్స్ నిర్మాణానికి దాతలకు ముందుకు వస్తున్నారని తెలిపారు.తిరుమల తరహాలో కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసి స్లాట్ విధానంలో భక్తులకు స్వామివారి దర్శనం అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. 54 గదులు, 4 డార్మిటరీల నిర్మాణానికి రూ.14 కోట్లతో ప్రతిపాదనలు కమిషనర్‌కు పంపిస్తున్నట్టు తెలిపారు. కొత్త బ్రిడ్జి నుంచి వాడపల్లి వరకూ డబుల్‌రోడ్డు నిర్మాణానికి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి అనుమతులు ఇస్తామని హామీఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రథశాల, కోనేరు, క్యూలైన్ల విస్తరణ పార్కింగ్ ప్రదేశాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.లక్షలాదిగా యాత్రికులు తరలిరావడంతో మాడవీధులను వెడల్పు చేయడానికి ప్రయత్నాలు చేపడుతున్నామన్నారు. రథశాల నిర్మాణం చేపట్టి కోనేరు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతో కలిసి అభివృద్ధిపనులను సమీక్షించారు. అక్టోబరు 10నుంచి 19వరకూ జరిగే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే చర్చించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కాయల జగన్నాథం, యేపుగంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలి

- జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

ముమ్మిడివరం,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): యూరియాను అధికంగా వినియోగించడంవల్ల నేల సహజ స్వభావం దెబ్బతింటుందని, దాని బదులుగా నానో ఎరువులు, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. ముమ్మిడివరంలోని జిల్లా వ్యవసాయఅధికారికార్యాలయంలో బుధవారం నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియాకు బదులుగా నానో ఎరువులను వినియోగించాలని రైతులకు ఆయన సూచించారు. విచ్చలవిడిగా రసాయనిక మందులు, పురుగు మందులను వినియోగించడంవల్ల భూసారం దెబ్బతినడంతోపాటు ఆహార పదార్థాల్లో వాటి అవశేషాలు ఉండి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. ఈ సందర్భంగా అభ్యుదయ రైతులను సత్కరించారు. గతరెండు సీజన్లలో నానో ఎరువులు ఉపయోగించినవారు సత్ఫలితాలుసాధించారన్నారు. మండపేట మండలం వెలగతోడు గ్రామానికి చెందిన ఎం.రామసురేష్, తాపేశ్వరానికి చెందిన టి.సతీష్, ఆలమూరు మండలం మోదుకూరుకు చెందిన బి.అబ్బులుచౌదరి, ముమ్మిడివరం మండలం ఠాణేలంకకు చెందిన బోసు శ్రీనివాసరావులను జిల్లా వ్యవసాయాధికారులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ వ్యవసాయ సంచాకులు ఎంఏ షంషీ, వ్యవసాయాధికారులు ఎ.అచ్యుతరావు, ఎస్.ప్రశాంత్‌కుమార్, ఇఫ్కో జిల్లా మేనేజర్ శ్యామ్‌ప్రసాద్‌బాబు, ఠాణేలంక, వెలగతోడు, తాపేశ్వరం సొసైటీల కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు గృహయోగం



- పీఎంఏవై-2 కింద ఉమ్మడి జిల్లాకు 3,458 ఇళ్లు
- యూనిట్ వ్యయం రూ.2.50 లక్షలకు పెంపు
- వైసీపీ హయాంలో ఇచ్చింది రూ.1.50 లక్షలే
- అదీ జగనన్న కాలనీల వారికే పరిమితం
- ఇప్పుడు సొంత స్థలాలు ఉన్న వారికీ అవకాశం
- లబ్ధిదారుల ఎంపిక పూర్తి
- జియోట్యాగింగ్ చేస్తున్న హౌసింగ్ సిబ్బంది

పట్టణ పేదలకు గృహయోగం కలిగింది. సొంత స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకుందామని భావించిన వారికి వైసీపీ హయాంలో మొండిచేయి చూపగా కూటమి ప్రభుత్వం మాత్రం వారికి అవకాశం కల్పించింది. గతం కంటే రూ.లక్ష అధికంగా ఇంటి నిర్మాణానికి అందించనున్నది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టణాలు, నగరాల్లోని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్‌యోజనా పథకం 2.0 అర్బన్ హౌసింగ్ కింద 3,458 గృహాలు మంజూరు చేయగా ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పక్రియ పూర్తి చేశారు.

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పట్టణాలు, నగరాల్లో సొంత స్థలాలు ఉండి గృహాలు నిర్మించుకుంటామని ముందుకు వచ్చిన వారికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు సంబంధించి గృహాలు మంజూరు, నిధులు కేటాయింపునకు సంబంధించిన జీవో జారీ కావడంతో గృహనిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దాదాపు ఆరేళ్ల అనంతరం సొంత స్థలాలు ఉన్నవారికి గృహయోగం కలగనున్నది. వైసీపీ హయాంలో జగనన్న కాలనీల్లో స్థలాలు ఉన్నవారికి మినహా ఇతరులు ఎవ్వరికి గృహనిర్మాణం నిమిత్తం నిధులు మంజూరు చేయలేదు. దీంతో జగన్ ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరంతా తమకు గృహాలు మంజూరు చేయాలంటూ నాటి ప్రజాప్రతినిధులు, అధికారులు చుట్టూ ప్రదక్షిణాలు చేసినా ఎటువంటి ఫలితం లేకపోయింది.

కూటమి ప్రభుత్వం రాగానే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణ, నగర ప్రాంతాల్లో పేదలకు గృహనిర్మాణంపై దృష్టి సారించింది. ఇందు నిమిత్తం కాకినాడ జిల్లాలోని కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, తుని, ఏలేశ్వరం, గొల్లప్రోలు పట్టణాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం పట్టణాలు, తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం నగరంతోపాటు కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో ఈ ఏడాది జనవరి నుంచి సొంత స్థలాలు ఉన్న పేదలు నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తుదారుల స్థలాలు, వారి అర్హతలు పరిశీలించి అర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.

నిధులు పెంచి మంజూరు

ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో గృహాలకు ఒకొక్కదానికి రూ.1.50 లక్షలు ఇస్తుంది. వైసీపీ హయాంలో ఈ నిధులను మాత్రమే జగనన్న కాలనీలకు కేటాయించి సొంతబాకా కొట్టుకుంది. కూటమి ప్రభుత్వం మాత్రం పెరిగిన గృహనిర్మాణ వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని కేంద్రం ఇచ్చే రూ.1.50 లక్షలకు అదనంగా మరో లక్ష రూపాయలను ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు గృహాల మంజూరు సందర్భంగా నిధులు పెంపును వర్తింపజేస్తూ జీవో జారీచేసింది. జిల్లాల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.86.45 కోట్లు వ్యయంతో 3,458 గృహాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. కాకినాడ జిల్లాకు రెండు విడతలకు కలిపి 2,226 గృహాలు మంజూరు చేయగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 475, తూర్పుగోదావరి జిల్లాకు 757 గృహాలు కేటాయించారు. కాకినాడ జిల్లాలో కాకినాడ నగరానికి 1165 గృహాలు, పిఠాపురం పట్టణానికి 200, గొల్లప్రోలుకు 110, పెద్దాపురం, సామర్లకోట పట్టణాలకు 348, తునికి 131, ఏలేశ్వరం పట్టణానికి 272 గృహాలు మంజూరయ్యాయి.

నిధులు ఇలా ఇస్తారు..

పీఎంఏవై పథకం కింద గృహాలు కేటాయింపు పూర్తికావడంతో హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడంతోపాటు స్థలాలను జియోట్యాగింగ్ చేస్తున్నారు. ఈ పక్రియ పూర్తికాగానే లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు అందజేసి పనుల ప్రారంభానికి అనుమతిస్తారు. లబ్ధిదారులకు స్లాబ్, లింటల్ (గోడలు), స్లాబు దశలతోపాటు పూర్తైన తర్వాత ఇలా నాలుగు దశల్లో సొమ్ములను వారి ఖాతాలకు చెల్లిస్తారు. ఈ దశలన్నింటిలో హౌసింగ్ సిబ్బంది గృహ నిర్మాణ పురోగతిని ఫోటోలు తీసి అప్‌లోడ్ చేసిన తర్వాతే సొమ్ములు చెల్లింపు జరుగుతుంది. ఆరేళ్ల తర్వాత తమ స్థలాల్లో గృహాలు నిర్మించుకునే అవకాశం లభించడంతో పట్టణ పేదలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు, కూటమి ప్రభుత్వం ద్వారా తమ సొంతింటి కల నేరవేరబోతున్నదని వారు తెలిపారు. కొన్ని పట్టణాల్లో ఇప్పటికే కొందరు లబ్ధిదారులు పునాదుల వరకూ నిర్మాణాలు పూర్తి చేశారు. దీనిపై కాకినాడ జిల్లా హౌసింగ్ పీడీ కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ పీఎంఏవై అర్బన్ కింద పట్టణాలు, నగరాల్లో గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఒక్కొక్క గృహ నిర్మాణానికి లబ్ధిదారునికి రూ.2.50 లక్షలు ఇవ్వనుందన్నారు. ఇప్పటికే అర్హులుగా గుర్తించిన లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ చేసి జియోట్యాగింగ్ చేస్తున్నామని ఆయన తెలియజేశారు.

స్వస్త్ నారీ-స్వశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం



ప్రధానమంత్రి స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

అమలాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యకరంగాఉంటుందని, దీనిద్వారా సమాజాన్ని ఆరోగ్య పథంలో నడిపించవచ్చునని ఎంపీ హరీష్ అన్నారు.అమలాపురంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో ప్రధానమంత్రి స్వస్త్ నారీ-స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు.ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, సేవల ద్వారా మహిళలు, పిల్లలకు సాధికారిత కల్పించే లక్ష్యంతో స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారన్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ఈ స్కీమ్ అమలుతో మహిళలు, పిల్లల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్నారు.ఆయుష్మాన్‌మందిరాలు, పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్యకేంద్రాలు, వైద్యశిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఆధార్ కార్డు,ఆయుష్మాన్ భారత్ కార్డులతో హాజరై ఈసేవలు వినియోగించుకోవాలన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారావుదొర మాట్లాడుతూ బుధవారంనుంచి అక్టోబరు 2 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర నోడల్ అధికారి లీనా, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు,అదనపు డీఎంహెచ్‌వో భరతలక్ష్మి, డీఐవో సత్యనారాయణ, డాక్టర్ సుమలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ శంకరరావు, టీడీపీ, బీజేపీ నాయకులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీసభ్యులు పాల్గొన్నారు.



బంగారు చేప చిక్కింది.. 1.5 కిలోలు రూ.6 వేలు

కాకినాడ కుంభాభిషేకం ఫిషింగ్ హార్బర్ వద్ద ఒక జాలర్ వలకి బంగారు చేప చిక్కింది. 1.5 కిలోలు బరువున్న ఈ చేప రూ.6 వేల ధర పలికింది. ఈ చేపను ఘోల్ చేప అని పిలుస్తారు. రంగును బట్టి బంగారు చేపగానూ పిలుస్తారు. ఈ చేపలోని గాల్ బ్లాడర్‌ను మందుల తయారీలో ఉపయోగిస్తారు. అందుకే దీనికి ఇంత డిమాండ్ ఉంటుందని మత్స్యకారులు చెప్పారు.

- ఆంధ్రజ్యోతి/ కార్పొరేషన్(కాకినాడ)



జీజీయూలో 'లిటిల్ హార్ట్స్'

లిటిల్ హార్ట్స్ చిత్ర బృందం రాకతో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం సందడి వాతావరణం నెలకొంది. లిటిల్ హార్ట్స్ సినిమా విజయ యాత్రలో భాగంగా ప్రముఖ హీరో మౌళి, నటుడు జయకృష్ణ జీజీయూను సందర్శించారు. ఈ సందర్భంగా సినిమాలోని కొన్ని డైలాగ్‌లను చెప్పి విద్యార్థులనుద్దేశించి కొద్దిసేపు మాట్లాడారు. విద్యార్థులు సినీనటులతో కలిసి ఫొటోలు తీయించుకునేందుకు ఆసక్తి చూపారు. అనంతరం హీరో మౌళిని జీజీయూ తరపున సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

- ఆంధ్రజ్యోతి/ రాజానగరం



'ఆదిత్య'లో కేటీఎం అకాడమీ సేఫ్ రైడింగ్

గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ మోటారు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేటీఎం అకాడమీ సేఫ్ రైడింగ్ ఈవెంట్‌ని డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. వందమందికి పైగా విద్యార్థులు ప్రొఫెషనల్ సేఫ్ రైడింగ్, రైడర్-డిసిప్లిన్, మోటారు స్పోర్ట్స్ భద్రతా ప్రమాణాలపై ప్రాక్టికల్ శిక్షణ పొందారు. హైదరాబాద్ కేటీఎం అకాడమీ డైరెక్టర్ ఆఫ్ ఈవెంట్స్ అమన్, ఆదిత్య తమ బృందంతో సేఫ్ రైడింగ్ నిర్వహించారు. - ఆంధ్రజ్యోతి/గండేపల్లి

నిరంతరాయంగా 'సుభోజనం'

దశాబ్దకాలంగా జీజీహెచ్‌లో హరేకృష్ణ మూమెంట్ వితరణ సేవ

ఉచితంగా నిత్యం వందలాది మంది ఆకలి తీరుస్తున్న దాతలు

రూ.10తో ఆరంభం.. ఇప్పుడు ఉచితం



భోజనం వడ్డిస్తున్న దాతతో కలసి వైకుంటేశ్వర దాస

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నదానాల్లో అన్నదానం గొప్పది అంటారు. అన్నార్తుల ఆకలి తీర్చడం కంటే గొప్ప సేవ ఏముంటుందని అందరూ భావిస్తారు. ఈ భావనతో దైవకార్యంలో ఉండే ఇస్కాన్ అన్నార్తుల ఆకలి తీర్చే పనిలో నిమగ్నమైంది. వీరి ఆధ్వర్యంలో పనిచేస్తున్న హరేకృష్ణ మూమెంట్ సంస్థ కాకినాడ జీజీహెచ్‌లో 'సుభోజనం' పేరుతో దాతల సహకారంతో వేలాది మంది రోగుల సహాయకులకు, నిరుపేదలకు హోటళ్లకు దీటుగా మంచి ఉచిత భోజనాన్ని అందిస్తోంది. జీజీహెచ్‌లో గత పది సంవత్సరాలుగా ఈ హరేకృష్ణ మూమెంట్ అండ్ టచ్ స్టోన్ ఛారిటీస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిరంతరాయంగా నడుస్తోంది. తొలుత రూ.10లకు ప్రారంభమైన ఈ సుభోజనం కొంతకాలం తరువాత దాతల సహకారంతో 90 శాతం ఉచిత భోజనంగా మారింది. రోగుల సహాయకులు 2016కు ముందు జీజీహెచ్ సమీపంలో ఉన్న హోటళ్లలో రూ.80 నుంచి రూ.100 ఖర్చు చేసి భోజనం కొనుగోలు చేసేవారు. అయితే జీజీహెచ్‌కు వచ్చేవారు ఎక్కువశాతం నిరుపేదలే కాబట్టి ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. సుభోజనం ప్రారంభించాక భోజనానికి ఖర్చు చేసే నగదు మందులకు ఉపయోగపడేవి అయితే సుభోజనం కౌంటర్‌లోని భోజనం బయట హోటళ్లకన్నా రుచిగా, శుచిగా ఉంటుందని రోగుల సహాయకులు చెబుతున్నారు.

ఇక సుభోజనం మొదలైన ఈ పదేళ్లలో జీజీహెచ్‌లో 20 లక్షల మందికి అన్న వితరణ జరిగింది. రెండు పూటల సుభోజనం సేవలు జరుగుతున్నాయి. ప్రతిరోజు సుమారు 850 మందికి అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం కేజీహెచ్‌లో సుభోజనం ప్రారంభించినప్పటి నుంచి నేటివరకు 40 లక్షల మందికి ఉచిత భోజనం అందజేయడం జరిగిందని సుభోజనం సమన్వయకర్త వైకుంటేశ్వరదాస తెలిపారు. అలాగే కేజీహెచ్‌ను స్ఫూర్తిగా తీసుకుని బాబా టాటా మెమోరియల్ కేన్సర్ హాస్పటల్‌లో 2023లో సుభోజనం ప్రారంభించడం జరిగింది. అలాగే 2018లో విజయవాడ జీజీహెచ్‌లో సుభోజనం ప్రారంభించాం. అలాగే 2021లో నెల్లూరు జీజీహెచ్‌లో సుభోజనం ప్రారంభించాం. మన కాకినాడ జీజీహెచ్‌తో కలిపి ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 5 సుభోజనం కౌంటర్ల ద్వారా ఇప్పటివరకు 75 లక్షల మంది రోగుల సహాయకులకు భోజన వితరణ కార్యక్రమం నిర్వహించామని వైకుంటేశ్వర దాస చెప్పారు. హరేకృష్ణ మూమెంట్ వ్యవస్థాపకులు భక్తి వేదాంతస్వామి ప్రభు. ఈ సంస్థ ఆశ్రమాలకు పది మైళ్ల దూరంలో ఎవరూ ఆకలితో ఉండరాదు అనే ఆయన ఆశయం మేరకు ఈ సుభోజనం ప్రారంభించినట్టు చెప్పారు. కాకినాడ జీజీహెచ్‌లో సుభోజనాన్ని విస్తరింపజేయడం, మరికొంతమందికి రుచిగల భోజనాన్ని అందించేందుకు దాతలు ఫోన్ నెంబర్ 8096211108ను సంప్రదించవచ్చని వైకుంటేశ్వరదాస చెప్పారు.



మధురపూడి విమానాశ్రయంలో బుధవారం నిర్వహించిన యాత్రీ సేవా దివస్‌లో భాగంగా ప్రయాణికులకు సంప్రదాయ స్వాగతం.. కూచిపూడి నృత్యం చేస్తున్న బాలికలు



విమానాశ్రయంలో...



విమానాశ్రయంలో బుధవారం యాత్రీ సేవా దివస్‌లో భాగంగా రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా యాత్రీ సేవా దివస్

కోరుకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి విమానాశ్రయంలో బుధవారం యాత్రీ సేవా దివస్-2025 వేడుకలు నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో అన్ని విమానాశ్రయాల్లో ఒకేసారి నిర్వహించిన ఈ వేడుకల్లో విమానాశ్రయ డైరెక్టర్ ఎస్‌కె.శ్రీకాంత్ నేతృత్వంలో రాజమండ్రి విమానాశ్రయం విశేషంగా పాల్గొంది. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ విమానయానం చేసే ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలను అందించాలనే నిబద్ధతను ప్రతిబింబించేలా ఈ దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రయాణికులు, ప్రజలు విశేషంగా స్పందించారన్నారు. కాగా వేడుకల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, క్విజ్, పెయింటింగ్ పోటీలు, విమానాశ్రయ భవనాల అలంకరణలు, ప్రయాణికులకు ఉచిత వైద్య పరీక్షలు, ఆతిథ్య సత్కారాలు నిర్వహించారు. అలాగే ఏక్ పేడ్ మాకే నామ్ నినాదంతో చెట్లు నాటడం, సీనియర్ సిటిజన్లకు సత్కారం, విద్యార్థులు విమానాశ్రయ సిబ్బందితో ముఖాముఖి కార్యక్రమాలు కూడా నిర్వహించారు. యాత్రీ సేవా దివస్ ద్వారా ప్రయాణికుల సౌకర్యం, భద్రత, సంతృప్తి ప్రాముఖ్యతను పునరుద్ఘాటించడం, భారతీయ విమానాశ్రయాలను మరింత కలుపుకుని స్థిరమైన, ప్రయాణికులకు అనుకూల వాతావరణంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని శ్రీకాంత్ వివరించారు. ఈ వేడుకలు విమానాశ్రయాలు, ప్రయాణికుల మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంపొందించాయని ఆయన అభిప్రాయపడ్డారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం

రూ.1.49 కోట్లు

- బంగారం 28 గ్రాములు, వెండి 2.180 కిలోలు
- ఏడు దేశాల కరెన్సీ లభ్యం
- వెల్లడించిన ఉప కమిషనరు, ఈవో

ఆత్రేయపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం తెరిచి లెక్కించారు. దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, టీవీఎస్ఆర్ ప్రసాద్, ఎం.సత్యనారాయణ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. 27 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.1,15,09,966, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.34,11,312 ... మొత్తం రూ.1,49,21,278 ఆదాయం లభించింది. బంగారం 28 గ్రాములు, వెండి 2.180 కిలోలు, ఏడు దేశాలకు చెందిన 45 కరెన్సీ లభించించినట్టు ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో శ్రీవారి సేవకులు, దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు, అర్చకులు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఆంధ్ర యువ సంకల్ప్ డిజిటల్ మారథాన్‌కు వీడియోలు ఆహ్వానం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువతను భాగస్వామ్యం చేస్తూ ఆంధ్ర యువ సంకల్ప్-2కే25 డిజిటల్ మారథాన్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం వీడియోలు ఆహ్వానిస్తున్నట్టు యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 30న నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www.andhrayuvasankalp.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి సోషల్ రెస్పాన్సిబిలిటీ, ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్, డిజిటల్ ఇన్నోవేషన్, ఏఐ టెక్నాలజీ, స్మార్ట్ యూత్ ఏపీ.... విభాగాల్లో సందేశాత్మక వీడియోలు తీసి పంపించాల్సి ఉంటుందన్నారు. 18-35 ఏళ్ల వయసు కలిగిన వారు అయి ఉండాలని, 120 సెకన్ల నిడివితో వీడియో ఉండాలన్నారు. షార్ట్‌లను వారి సొంత సోషల్ మీడియాలో (ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ షార్ట్స్) మార్గదర్శకాల్లో చూపించిన అధికారిక హాష్‌టాగ్‌లతో పోస్ట్ చేయాలని కోరారు. జ్యూరీల వచ్చిన ఎంట్రీలను పరిశీలించిన అనంతరం మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75వేలు, తృతీయ బహుమతిగా రూ.50వేలు ఇస్తారన్నారు. తొమ్మిది మంది విజేతలను 'ఆంధ్ర యువ సంకల్ప్-2కే25' అంబాసిడర్లుగా సత్కరిస్తారని చెప్పారు.

29న కాకినాడలో జయలక్ష్మి సొసైటీ మహాజన సభ సమావేశం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ దంటు కళా క్షేత్రంలో ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ది జయలక్ష్మి ఎంఏఎం కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ 4వ మహాజన సభ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు తెలిపారు. అజెండాలోని విషయాలను జయలక్ష్మి సొసైటీ సభ్యులందరికీ ఈ నెల 8వ తేదీన నోటీసు ద్వారా పంపించామన్నారు. జయలక్ష్మి సొసైటీ పాలకవర్గంలో ఇద్దరు డైరెక్టర్లు, ఆఫీసు బేరర్ (ట్రెజరర్) పదవులు ఖాళీ అయ్యాయని.. ఈ స్థానాలకు ఎన్నిక నిర్వహించేందుకు ఈ నెల 12న షెడ్యూలు జారీ అయ్యిందని, అదే రోజున ప్రాథమిక ఓటర్ల జాబితా ప్రకటించామన్నారు. అందులో క్లెయిమ్స్, అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు చైర్మన్/సీఈవోకి రాతపూర్వకంగా అందించాలని ఒక ప్రకటనలో కోరారు.



రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

'నన్నయ'లో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ విద్యార్థులకు బుధవారం డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 86 మంది విద్యార్థులు హాజరై రాత పరీక్ష రాయగా 54 మందిని షార్ట్ లిస్ట్ చేశారని వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు. తర్వాత వారికి ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఈ డ్రైవ్‌ను వీసీ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయం తరఫున ఎక్కువ మందికి ఉద్యోగావకశాలు కల్పించాలని కోరారు. తరచూ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ డ్రైవ్‌లు జరిపి ఎక్కువ మంది విద్యార్థులు ఉద్యోగాలు అందిపుచ్చుకునే అవకాశం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మక అనుభవంగా మార్చుకోవాలి

ప్రాంగణ నియామక శిక్షణ ప్రారంభోత్సవంలో నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఉప కులపతి ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మక అనుభవంగా మార్చి లక్ష్యాలను చేరుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ కోరారు. ఉపాధి సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుని కార్పొరేట్ ప్రపంచంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ నియామక శిక్షణ (సీఆర్‌టీ) బుధవారం ప్రారంభమైంది.

ఇందులో పాల్గొన్న వీసీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సీఆర్‌టీ ద్వారా గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్ ఉపాధి సామర్థ్యాలను పెంపొందిస్తూ కార్పొరేట్ ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేస్తారన్నారు. ఆప్టిట్యూడ్ పరీక్షలు, సాంకేతిక ఇంటర్వ్యూలు, బృంద చర్చలు వంటివి నియామక ప్రక్రియల్లో వారి పనితీరును మెరుగుపరచడం ద్వారా విద్యార్థులకు సహాయపడతాయని చెప్పారు. తద్వారా విద్యాభ్యాసం, పరిశ్రమ డిమాండ్ల మధ్య అంతరం తగ్గుతుందన్నారు. మూడు రోజులు జరిగే శిక్షణలో కంట్రోల్ సిస్టమ్‌లో సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

విశ్వవిద్యాలయం ఉద్యోగ కల్పనాధికారి బి.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ పీఎం ఉషా సహకారంతో ఎస్‌డీవీఎల్ సంస్థతో విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ విభాగం, నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్వహిస్తున్న సీఆర్‌టీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు ప్రశాంతి, సునీత వివిధ అంశాలను వివరించారు.



టేబుల్ టెన్నిస్ ఎంపికలను ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్

అండర్-14, 17 టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాలులో బుధవారం జరిగిన అండర్ 14, 17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపికలో సుమారు 120 మంది పాల్గొన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ ప్రారంభించారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షించారు. పీటీ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవిరాజు, పీడీలు లంక జార్జ్, మంగయమ్మ, వి.అరుణ, రవికౌర్, సునీల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, ఎం.హరిబాబు, ఎల్.రవికుమార్, శ్రీహరిరాజు, శంషాద్ బేగం, ఎల్.సతీష్, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎస్‌జీఎఫ్ సెలక్షన్లు వాయిదా

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ సెలక్షన్లు, మండల స్థాయి సెలక్షన్లు, కాకినాడ జిల్లాలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగాల్సిన సెలక్షన్స్ వాయిదా వేశామని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి తెలిపారు. ఆ తేదీల్లో ఉమ్మడి మెగా డీఎస్‌ఏ వ్యాయామ ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో డ్యూటీలో ఉండడం వల్ల కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల కోసం నాలుగో విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలశర్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి మూడు విడతల్లో సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా నాలుగో విడతలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవల్ చేయించుకోవాలన్నారు. లేదంటే కౌన్సెలింగ్‌కు అర్హులు కాదని తెలిపారు. మరిన్ని వివరాలకు 08842348182, 9440408182 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 29న, ప్రైవేట్ ఐటీఐలో ఈ నెల 30న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

బాకీ తీర్చేస్తానని పిలిచి.. బావిలోకి తోసేసి!

● ఇద్దరిని చంపి మరొకరిపై హత్యాయత్నం
● కాకినాడ జిల్లా తాటిపర్తిలో ఘాతుకం
● పోలీసుల అదుపులో నిందితుడు!



గొల్లప్రోలు మండలం తాటిపర్తి పొలాల్లోని బావిలో తేలిన మృతదేహం





హత్యకు గురైన శ్రీను, సూరి బాబు (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): తీసుకున్న అప్పు తీర్చమన్నందుకు ఇద్దరిని హత్య చేయడమే గాక నూతిలో పడవేసి మరొకరిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జరిగింది. ఈ సంఘటన బుధవారం పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించింది.

అసలేం జరిగిందంటే...

తాటిపర్తి గ్రామానికి చెందిన రంపం గంగాధ ర్ అవసరాల నిమిత్తం తన బంధువులైన రంపం శ్రీను (51), తోరాటి సూరిబాబు (44), కుంపట్ల సూరిబాబు (36) వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చకపోవడంతో గంగాధర్‌ను చెల్లించాల ని వారు ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మం గళవారం రాత్రి 8గంటల సమయంలో రంపం శ్రీను, తోరాటి సూరిబాబుకు గంగాధర్ ఫోన్ చేసి అప్పు తీర్చేస్తానని, మాట్లాడే పని ఉందని పిలిచి పథకం ప్రకారం గ్రామ శివారుకు తీసుకువెళ్లాడు. అక్కడ పొలాల్లో ఉన్న బావి వద్దకు వెళ్లిన తర్వాత వారిద్దరిని నూతిలోకి తోసేసి హత్య చేశాడు. అనంతరం మరొక వ్యక్తి కుంపట్ల సూరిబాబుకు బాకీ ఇచ్చేస్తానని చెప్పి రమన్నాడు. గంగాధర్ సూరిబాబును తన మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని తాటిపర్తి పుంతరోడ్డులోని సుద్దగడ్డ వాగు వద్దకు తీసుకువెళ్లి సెల్‌ఫోన్ పడిపోయిందని చెప్పి వెతుకుతున్నట్టు నటించాడు. అదే సమయంలో సూరిబాబును చంపేందుకు ప్రయత్నించగా తప్పించుకుని గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. కుంపట్ల సూరిబాబు ఫిర్యాదుపై పిఠాపురం సీఐ శ్రీనివాస్ కేసు నమో దు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాకినాడ ఏ ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ సంఘటనా స్థలా న్ని పరిశీలించారు. రంపం శ్రీను కౌలు రైతు కాగా అతడికి భార్య బేబీ, ముగ్గురు కుమారులు ఉన్నారు. తోరాటి సూరి బాబు కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య భవానీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



సంఘటనా స్థలంలో పోలీసు జాగిలాలు



విలపిస్తున్న సూరిబాబు కుటుంబసభ్యులు

అప్పిస్తే ప్రాణం తీశాడు..

ఆపదలో ఉన్నాను, సొమ్ములు కావాలని చెప్పడంతో అప్పు ఇస్తే రంపం గంగాధర్ తమ వారి ప్రాణాలు తీశాడని తోరాటి సూరిబాబు, రంపం శ్రీను కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ సంఘటన తాటిపర్తి పరిసర గ్రామాల్లో సంచలనంగా మారింది. పథకం ప్రకారమే గంగాధర్ ఈ ఇద్దరిని హత్య చేసినట్టు చెప్తున్నారు. కాగా కేసు దర్యాప్తులో ఉందని, ఆర్థికపరమైన విషయాలే ఈ సంఘటనకు కారణమని ఏఎస్పీ తెలిపారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసు జాగిలాలు నిందితుడు రంపం గంగాధర్ ఇంటి వరకూ వెళ్లి ఆగాయి. అయితే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం తెలిసింది.

స్క్రూడ్రైవర్ నెయిల్ మింగిన బాలుడు

శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన భద్రాచలం ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు



ఆపరేషన్ అనంతరం బాలుడితో వైద్యులు, సిబ్బంది



బాలుడు మింగిన నెయిల్

ఎటపాక, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఎనిదేళ్ల బాలుడు స్క్రూ డ్రైవర్ నెయి ల్‌ను మింగి ప్రాణాల మీదుకు తెచ్చు కున్నాడు. చివరకు భద్రాచలం ప్రభు త్వ వైద్యశాల వైద్యులు బాలుడి పేగులో ఇరుకున్న 6 సెంటీమీటర్ల స్క్రూ డ్రైవర్ నెయిల్‌ను తొలగించి ప్రాణాలు కాపా డారు. అల్లూరి జిల్లా ఎటపాక మండ లం చోడవరం గ్రామానికి చెందిన తు మ్మల సునీల్, రాజేశ్వరి దంపతుల తు మ్మల గౌతమ్(8) మూడురోజుల క్రితం ఆడుకుంటూ స్క్రూ డ్రైవర్ నెయిల్‌ను మింగాడు. అప్పటి నుంచి కడుపులో నొప్పి వస్తుందని తల్లిదండ్రులకు తెలి పాడు. తాను స్క్రూ డ్రైవర్ నెయిల్‌ను మింగానని తెలిపినా తల్లిదండ్రులు నమ్మలేదు. కడుపు నొప్పితో కుమారుడు బాధపడుతు న్నాడని తల్లిదండ్రులు బుధవా రం భద్రాచలం ఏరియా వైద్య శాలకు తీసుకెళ్లారు. దీంతో బాలుడిని పరీక్షించిన వైద్యులు ఎక్స్‌రే తీసి బాలుడి పేగులో స్క్రూడ్రైవర్ నెయిల్ ఇరుకున్నట్టు గుర్తించారు. దీంతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరిండెంటెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ నేతృత్వంలో వైద్యులు, సిబ్బంది బృందం శస్త్ర చికిత్స చేసి 6 సెంటీమీటర్ల స్క్రూడ్రైవర్ నెయిల్‌ను తొలగించారు. బాలుడు ప్రాణాపాయం నుంచి బయటపడి క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో
సుప్రీం ఆదేశాలు పాటించాలి : పీడీజే



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 17(ఆంధ్ర జ్యోతి): హిట్ అండ్ రన్ ప్రమాద కేసుల్లో సుప్రీంకోర్టు ఆదేశాలను కచ్చితంగా పాటించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. జిల్లా కోర్టు ఆవరణలో ఈ మేరకు బుధవారం మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ కమిటీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి జిల్లాలోని రెవెన్యూ, పోలీసు అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. మోటారు వాహనాల చట్టం-1988, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్స్ స్కీమ్-2022 నిబంధనలను అనుసరిస్తూ బాధితులకు పరిహారం అందజేయడంలో కమిటీ బాధ్యతగా వ్యవహరిస్తూ సహాయాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపేట, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం ఆర్డీవోలు శ్రీకర్, కృష్ణ నాయక్, అఖిల తదితరులు పాల్గొన్నారు.

16వ నెంబరు జాతీయ రహదారి
ఆరులైన్ల విస్తరణకు ప్రణాళికలు

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో స్టేక్‌హోల్డర్స్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పాల్గొన్న ఎమ్మెల్యేలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 17(ఆంధ్ర జ్యోతి): జిల్లా సత్వరాభివృద్ధి, ప్రజల జీవన వికాసానికి దోహదం చేసే 16వ నెంబరు జాతీయ రహదారి ఆరులైన్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హైవేస్ అథారిటీ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారిని ఆరులైన్ల విస్తరణ కోసం నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో వివిధ అలైన్‌మెంట్ ఆప్షన్లతో సిద్ధం చేసిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టుపై ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో స్టేక్‌హోల్డర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగు లైన్ల రహదారిగా ఉన్న దీన్ని ఇరువైపులా విస్తరించి 60మీటర్ల వెడల్పుకు పెంచుతామన్నారు. వంపులు సరిచేయడానికి, జనా వాసాలను తప్పించడానికి అవసరమైన చోట్ల 60 మీటర్ల వెడల్పులో బైపాస్‌రోడ్లు ప్రతిపాదించామన్నారు. ప్రజల సౌకర్యం కోసం అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు, సర్వీసురోడ్లు అలైన్‌మెంట్‌లో ప్రతిపాదించామన్నారు.

అలైన్మెంట్‌లతో డీపీఆర్‌కు రూపకల్పన

నేషనల్ హైవేస్ అథారిటీస్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్‌కుమార్ మాట్లాడుతూ జాతీయరహదారి విస్తరణలో భాగంగా అనకాపల్లి నుంచి అన్నవరం మీదుగా దివాన్‌చెరువు వరకు 741.255 కిలోమీటర్ల నుంచి 903.00 కిలోమీటర్ల వరకు ఉన్న నాలుగులైన్ల రోడ్డును ఆరు లైన్ల పాక్షిక యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా అభివృద్ధి చేసేందుకు వివిధ అలైన్మెంట్‌లతో డీపీఆర్ రూపొందించామన్నారు. ప్రతిపాదిత ఆరులైన్ల రహదారి విస్తరణలో అనకాపల్లి, కసింకోట, యలమంచిలి, పాయకరావుపేట మండలాల్లో 68.645 కిలోమీటర్లు, కాకినాడ జిల్లాలోని తుని, శంఖవరం, తొండంగి, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం, గండేపల్లి మండలాల్లో 80.600 కిలోమీటర్లు నిర్మిస్తామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం మండలంలో 11 కిలోమీటర్లు ప్రతిపాదించామన్నారు. మొత్తంగా 160 కిలోమీటర్లు మేరకు నిర్మించాలన్నారు. విస్తరణలో భూసేకరణ, నిర్మాణ వ్యయం, జనజీవనం, రహదారిపై కట్టడాలు, ఫ్లైఓవర్లు వంటి అంశాలు పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు.

మార్పులు సూచించిన ఎమ్మెల్యేలు..

ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, నిమ్మకాయల చినరాజప్ప తమ నియోజకవర్గాల్లో ప్రతిపాదించిన రోడ్డులో అవసరమైన మార్పులు సూచించారు. జాతీయ రహదారి అంతా సౌరశక్తితో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల కోరారు. ఎన్‌హెచ్ 16, ఏడీబీ రోడ్లు కలిసే చోట రాజానగరం కూడలిలో ట్రంపెట్ కనెక్షన్ నిర్మించాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు. ధర్మవరం వద్ద జాతీయ రహ దారి పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటేందుకు అండర్‌పాసులు ఏర్పాటు చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ సూచించారు. తొండంగి వైపున సర్వీసు రోడ్డు నిర్మించాలని తుని ఎమ్మెల్యే దివ్య సూచించారు. సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, డీఆర్వో వెంకట్రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కంతు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ప్రసాద్, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం జీజీహెచ్ అభివృద్ధికి
దాతలు ముందుకురావాలి : ఎంపీ



అధునాతన వైద్య పరికరాలు ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధికి దాతలు మరింతమంది ముందుకురావాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు గెయిల్ సమకూర్చిన అధునాతన వైద్యపరికరాలను ఆసుపత్రి అధికారులకు అందజేసే కార్యక్రమంలో ఎంపీ ముఖ్య అతిథిగా ఎంపీ మాట్లాడుతూ బోధనాసుపత్రి ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందని, దాతలు సహకరిస్తే ఎక్కువ మందికి సహాయం అందించే అవకాశం ఉంటుందన్నారు. జీజీహెచ్‌లో వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో లేవని వైద్యులు, సిబ్బంది కొరత ఉందని చెప్తున్నారని, ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఏ ఒక్కరినీ కాకినాడ రిఫర్ చేసే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రి ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణంరాజు, ఆర్ఎంవో సుబ్బారావు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం, ఎంపీపై అనుచిత వ్యాఖ్యలు

పిఠాపురం పోలీసులకు జనసేన నాయకుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

పిఠాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌లను కించపరిచే విధంగా సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం సాయంత్రం కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం తపిస్తున్న పవన్, ఎంపీలపై బి.ఐశ్వర్య అనే మహిళ అనుచిత వ్యాఖ్యలు చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారని తెలిపారు. బాధ్యులపై కేసు నమోదు చేయాలని వారు కోరారు.

అమ్మోనియం గ్యాస్ లీకేజీ

తాళ్లరేవు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని రెడ్డివారిపాలెం వద్ద జెమినీ ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియం గ్యాస్ లీకవ్వడంతో బుధవారం గ్రామస్తులు భయాందోళన చెందారు. గ్రామస్తులంతా ఐస్ ఫ్యాక్టరీ సిబ్బందిని నిలదీశారు. గ్రామస్తులతో డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు చర్చించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఐస్ ఫ్యాక్టరీ చుట్టుపక్కల రైతుల పంటనష్టంపై విచారణ చేయించి న్యాయం చేస్తామన్నారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

'నన్నయ'లో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యూజీసీనెట్, జెఆర్ఎఫ్‌లలో అర్హత సాధించిన అభ్యర్థులను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. బుధవారం దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలుపుతూ నన్నయ విశ్వవిద్యాలయం వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ ప్రోగ్రామ్‌లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. సీఎస్ఐఆర్‌నెట్, జెఆర్ఎఫ్‌లలో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులని స్పష్టంచేశారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబరు 4వ తేదీలోపు దరఖాస్తు సమర్పించాలని చెప్పారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో గాని సంప్రదించాలని ఆమె తెలిపారు.

కాజులూరు రోడ్లు కానరావా?

● రోడ్ల దుస్థితిపై అఖిలపక్ష నాయకుల ఆందోళన ● వంటా వార్పు, రాస్తారోకో



కాజులూరు కృష్ణుడి గుడి వద్ద రోడ్డుపై వంటవార్పుతో ఆందోళన చేస్తున్న జేఏసీ నాయకులు

కాజులూరు(కరప), సెప్టెంబరు 17(ఆంధ్ర జ్యోతి): భారీ గోతులు, గతుకులతో అధ్వాన్నంగా మారిన కాకినాడ జిల్లాలోని కాజులూరు రోడ్ల దుస్థితిని నిరసిస్తూ అఖిలపక్ష నాయకులు బుధవారం తీవ్రస్థాయిలో ఆందోళన చేపట్టారు. కాజులూరు కృష్ణుడి గుడి వద్ద వందలాది మంది రాస్తారోకో చేసి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. రోడ్డుపైనే వంటా వార్పు నిర్వహించి అసంపూర్తిగా వదిలేసిన గొల్లపాలెం-కుయ్యేరు ప్రధాన రహదారితో బాటు ఇతర శిథిల రోడ్లు, వంతెనల నిర్మాణాలను ప్రభుత్వం తక్షణం చేపట్టాలంటూ పెద్దఎత్తున డిమాండ్ చేశారు. గతంలో రూ.36కోట్లతో చేపట్టిన గొల్లపాలెం-కుయ్యేరు ప్రధాన రహదారి నిర్మాణాన్ని వివిధ కారణాలతో మధ్యలోనే నిలిపివేశారని దీని వల్ల దాదాపు 30గ్రామాలకు చెందిన వేలాదిమంది నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని ఆరోపించారు. జూలైలో దీనిపై ధర్నా చేపట్టగా మంత్రి సుభాష్ ఆగస్టు 5 నుంచి పనులను పునఃప్రారంభిస్తామని మాట ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి రోడ్డుకు మోక్షం కలిగించాలని లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కాజులూరు తహశీల్దార్ జి.రవీంద్రనాథ్, ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ ఘ టనాస్థలికి చేరుకుని ఆందోళనకారులను సర్దిచెప్పే ప్రయత్నంచేశారు. ఈ క్రమంలో వారి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కొంతమంది స్థానిక నేతల ప్రమేయంతో ఆందోళన విరమించారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, జేఏసీ నాయకులు సలాది నానాజి, యాళ్ల సత్తిబాబు, శీల మాజీ ఎంపీటీసీ మాధవరపు నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డులో పడి గణిత ఉపాధ్యాయుడికి గాయాలు



గాయాలతో ఉపాధ్యాయుడు

గతుకులతో అధ్వానంగా మారిన కాజులూరు మండలం దుగ్గుదురు ప్రధాన రహదారిపై అదుపుతప్పి పడి ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. కాజులూరు హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చుండి శ్రీష మంగళవారం ఉదయం స్కూటీపై ద్రాక్షారామ నుంచి కాజులూరు హైస్కూల్‌కు బయలుదేరాడు. దుగ్గుదురు వచ్చేసరికి బండిపై నుంచి అదుపుతప్పి కిందపడిపోయాడు. తలతో పాటు పలుచోట్ల తీవ్ర గాయాలై కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాజులూరు మండలంలోని రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయనడానికి ఈ ఘటనే నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు.

రేపు కొత్త టీచర్లకు నియామకపత్రాల జారీ

విజయవాడలో అందజేయనున్న సీఎం చంద్రబాబు
ఉమ్మడి జిల్లా నుంచి 70 ఆర్టీసీ బస్సులు సిద్ధం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ - 2025లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి టీచర్లుగా విజయం సాధించిన అభ్యర్థులను విజయవాడ తీసుకెళ్లడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి 70 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 19న విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొనే ఒక కార్యక్రమంలో కొత్త టీచర్లకు సీఎం నియామకపత్రాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి వారంతా వెళ్లడానికి వీలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి 50 బస్సులు, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి పదేసి బస్సుల చొప్పున కేటాయించారు. 19న ఉదయం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్ నుంచి ఈ బస్సులన్నీ విజయవాడ బయలుదేరి వెళ్లనున్నాయి. ఇప్పటికే స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు పథకానికి ఏ రోజుకారోజు బస్సులను సంసిద్ధం చేసే పనిలో తలమునకలై ఉన్న ఆర్టీసీ అధికార యంత్రాంగానికి తాజాగా విజయవాడకు బస్సులను కేటాయించాల్సి రావడం కత్తి మీదసాములా మారిందని చెప్తున్నారు.

పోలీసునంటూ లారీ డ్రైవర్‌కు బెదిరింపు

కొవ్వూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసునంటూ లారీ డ్రైవర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మేడ్చల్ జిల్లా దూలపల్లికి చెందిన గాండ్ల సంతోష్ హైదరాబాద్‌లోని శంషాబాద్ నుంచి ఐచర్‌వ్యాన్‌పై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వైపు బయలుదేరాడు. మంగళవారం రాత్రి కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్ట వద్ద జి యో పెట్రోల్‌బంకు వద్ద నిద్ర వస్తుందని వ్యాన్‌ను రోడ్డుపక్కగా ఆపి నిద్రించాడు. బుధవారం ఉదయం ఏపీ39 డీఎల్ 0942 నంబరు గల హూండాషైన్ బైక్‌పై సుమారు 50 ఏళ్ల వ్యక్తి ఎస్ఐ డ్రెస్ వేసుకుని చేతిలో మ్యాన్‌ప్యాక్ పెట్టుకుని వచ్చి రోడ్డుపక్కన వ్యాన్ ఎందుకు ఆపావు. రికార్డు సరిగాలేదని డ్రైవర్ సంతోష్‌ను బెదిరించి స్టేషన్‌కు పద అని కొంతదూరం తీసుకువెళ్లి రూ.2వేలు తీసుకుని డ్రైవర్‌ను వదిలిపెట్టి కొవ్వూరు వైపు వెళ్లిపోయాడు. సంతోష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

బైక్ చోరీపై కేసు

కె.గంగవరం, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లిలో బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా చెప్పారు. కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన బొజ్జా వెంకటరమణ ఈనెల 9న కోటిపల్లి శివాలయానికి అక్కడి నుంచి గోదావరి రేవుకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు వెంకట రమణకు బైక్‌ను దొంగిలించుకుని పోయారు. వెంకట రమణ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జానీబాషా చెప్పారు.

ఫ్లాట్‌కి నిప్పంటించిన వ్యక్తి అరెస్ట్



రవిని అరెస్ట్ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలో గోపీకృష్ణా రెసిడెన్సీలో మూడో అంతస్తులోని సీ-4 ఫ్లాట్‌కి డీజిల్ పోసి నిప్పంటించిన నిందితుడిని బుధవారం సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. రమణయ్యపేటకు చెందిన పిల్లి సత్తిబాబు, భార్య దుర్గ, ఇద్దరు కుమార్తెలు సృజన, భానుచంద్రిక కుమారుడు మణికార్తీక్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ నెల 14న ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఎవరో ఆగంతకుడు ఫ్లాటులోకి డీజిల్ పోసి నిప్పు అంటించడంతో ఇంట్లోని ఫర్నీచర్, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతి కావడం, డీజిల్ వాసనకు శ్వాస ఆడక అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ప్రధాన డోర్ తీసేందుకు ప్రయత్నించినా, మంటలకు తలుపు రాకపోవడంతో రక్షించమని ఆర్తనాదాలు చేశారు. పరిసర ఫ్లాటులోని వారు వచ్చి తలుపు,అద్దం బద్దలుకొట్టి ఐదుగురు కుటుంబసభ్యులను కాపాడారు. ఈ ప్రమాదంపై తనకు ఇదే రెసిడెన్సీలో పెంట్‌హౌస్‌లో నివాసం ఉంటున్న పొన్నగంటి రవిచంద్రకుమార్ (రవి)పై అనుమానం ఉందని బాధితుడు సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ ఆదేశాల మేరకు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ పి.శ్రీనివాస్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఫ్లాట్ లోపల, వెలుపల గల సీసీ కెమెరాలను పరిశీలించి, వాచ్‌మేన్‌తో పాటూ పలువురుని విచారించారు. సంఘటన జరిగిన రోజున ఫ్లాటులోకి అర్ధరాత్రి రవి ఒక్కడే సంచరించడాన్ని గుర్తించి అతడిని సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ అదుపులోకి తీసుకుని విచారించారు. సత్తిబాబుతో ఉన్న వ్యక్తిగత కక్షతోనే ఫ్లాట్‌లోకి డీజిల్ పోసి తగలబెట్టినట్లు నేరం అంగీకరించాడు. అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసు విషయంలో చురుగ్గా పనిచేసిన ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్, సిబ్బంది సీఐ అభినందించారు.

వీధికుక్కల దాడిలో వృద్ధురాలికి గాయాలు



గాయపడిన సత్యవతి



బిక్కవోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో బుధవారం గ్రామానికి చెందిన వాసిరెడ్డి సత్యవతి (60)పై వీధికుక్కలు దాడి చేసి గాయపర్చాయి. బుధవారం ఉదయం ఆమె ఇంటి ముందు తుడవడానికి బయటకు రాగా అక్కడే ఉన్న వీధి కుక్కలు దాడిచేసి చేతిపైన, నుదుటిపైన, ముక్కును కరచి గాయపర్చాయి. దీంతో స్థానికులు కుక్కలను తరిమేసి ఆమెను అనపర్తి ఏరియాఆసుపత్రికి తరలించారు.

మోదీ పుట్టినరోజు వేడుకలు

అంతర్వేది, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో ఉన్న గోశాల వద్ద బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మోదీ పుట్టినరోజు వేడుకలను జరిపారు. పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధాని పేరున అర్చకులు పూజలు చేయించారు.

వివరాలు తెలుసుకునేందుకే యాప్

ముమ్మిడివరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సభ్యులు వారి అప్పు, పొదుపు వివరాలు తెలుసుకునేందుకు ప్రవేశపెట్టిన యాప్‌ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కొత్తలంకలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతీ ఒక్కరూ ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఉమెన్ పవర్ యాప్ డౌన్లోడ్ చేసుకుంటే పొదుపు, అప్పు వివరాలు తెలుసుకోవచ్చన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌సీ సీసీలు దుర్గాప్రసాద్, రవిరాజా, వీవోఏలు నిర్మల, లక్ష్మి, రమాకుమారిలతో పాటు యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

మండల సమావేశంలో ఎమ్మెల్యే దేవ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది తీర ప్రాంత గ్రామాలు ఎదుర్కొంటున్న ఉప్పునీటి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి అధ్యక్షతన జరిగిన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ మిగిలిన ప్రాంతం డ్రెడ్జింగ్ చేయడానికి, డ్రెయిన్‌కు ఇరువైపులా గట్లు ఎత్తు చేయడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, ఈరెండు పనులకు త్వరలో నిధులు మంజూరవుతాయన్నారు. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ పూర్వ కాలం నుంచి డ్రెడ్జింగ్ చేయకపోవడంతో ఉప్పునీరు పారుదల లేక మీడియం, మైనరు డ్రెయిన్ల వ్యవస్థ కూడా పాడైందని తద్వారా భూగర్భ జలాలు కలుషితమై డయాలసిస్ రోగులు పెరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై జలవనరుల శాఖ మంత్రితో మాట్లాడడం జరిగిందని, ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళతానన్నారు. ఈప్రాంత అభివృద్ధి కోసం పాటుపడుతున్నానన్నారు. పెండింగ్‌లో ఉన్న రోడ్లకు కూడా నిధులు మంజూరవుతున్నాయన్నారు. రూ.50కోట్లతో విద్యుత్, మౌలిక వసతులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అప్‌గ్రేడ్ చేయడం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకుచ్చామన్నారు. పలువురు సభ్యులు పలు సమస్యలపై మాట్లాడారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జడ్పీటీసీ రత్నకుమారి, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి, తహశీల్దార్ టి.శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యాలయ సూపరింటెడెంట్ మిల్టన్ పాల్గొన్నారు.

యూరియా వాడకాన్ని ఎలా తగ్గించుకోవచ్చు?

మండల సర్వసభ్య సమావేశంలో ఏవో


మాట్లాడుతున్న ఎంపీపీ వీరఅచ్యుతజానకి

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): యూరియా వాడకాన్ని తగ్గించుకోవడం ఎలా? అనే అంశంపై వ్యవసాయాధికారి విశ్లేషాత్మక ప్రసంగాన్ని సభ్యులు ఆసక్తిగా విన్నారు. ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు అధ్యక్షతన, ఇన్‌చార్జి ఎంపీడీవో బి.తులసీకృష్ణ నిర్వహణలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో ఈఏడాది సార్వా సాగు విస్తీర్ణం 4,465ఎకరాలు కాగా వర్షాలకు 670ఎకరాలు నీటిపాలైనట్టు వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు వివరించారు. సార్వాలో 559టన్నుల యూరియా అవసరం కాగా ఆగస్టు నెలాఖరుకు 454టన్నులు వినియోగం జరిగిందన్నారు. సెప్టెంబరులో 190 టన్నులు పీఏసీఎస్‌లకు చేరిందన్నారు. యూరియా కొరత లేదన్నారు. గొరగనమూడి డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు నెలలు గడుస్తున్నా ఎందుకు ప్రారంభం కాలేదన్న నీటిపంపిణీ సంఘం చైర్మన్ దంగేటి చిట్టిబాబు ప్రశ్నించారు. తొందరలోనే ప్రారంభిస్తామని డ్రెయిన్స్ ఏఈ సునీత బదులిచ్చారు. విద్యుత్ లో వోల్టేజీ నివారణకు కొత్తగా 15ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్టు ట్రాన్స్‌కో ఏఈ శ్రీహరి తెలిపారు. మండలంలో 5మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ఐసీడీఎస్ అధికారిణి తెలిపారు. కార్యక్రమాన్ని ఎంపీపీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, సొసైటీ చైర్మన్లు చిక్కం ఉమేష్, సాకా రాంబాబు, మంచెం బాలకృష్ణ, నీటి సంఘాల చైర్మన్లు పోలిశెట్టి ఉమామహేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ముమ్మిడివరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చేనేత సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ముమ్మిడివరం చేనేత సహకార సంఘ మేనేజర్ సలా గురుమూర్తి, జాగు రాంబాబు బుధవారం ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎమ్మెల్యేను కలిసి వారు వినతిపత్రాన్ని అందించారు. చేనేత సంఘాలకు ఎన్నికలు జరిపించాలని, ఆప్కో నుంచి చేనేత సహకార సంఘాలకు రావాల్సిన బాకీలు ఇప్పించాలని, చేనేత వస్త్రాలకు విక్రయాలపై 30శాతం రిబేటు ఇప్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి చేనేతల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలి

అంతర్వేది, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం ఎంఈవో కార్యాలయం వద్ద ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా ఈఉద్యోగాలనే నమ్ముకున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం టైమ్ స్కేలు అమలుచేసి ఇతర సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబరు 12న విజయవాడ కేంద్రంలో దశాబ్ద ఐక్యత-భవిష్యత్తు పోరాట సభ రాష్ట్ర కమిటీ నిరసన కార్యక్రమం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో రజనీకుమారి, శాంతి, దివ్య, రాజబాబు, మల్లేశ్, సంధ్య, సాగర్, ప్రశాంత్, కిశోర్ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ముమ్మిడివరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను ఆధునికీకరింపచేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. కొత్తలంకలో రూ.96.31లక్షల నాబార్డు నిధులతో ఆధునికీకరింపచేసే పత్సమట్ల వారిపాలెం రోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈరోడ్డు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టరు, అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తాడి నరసింహారావు, దాట్ల పృథ్వీరాజ్, అర్థాని శ్రీనివాస్, గుత్తుల సాయి, గుత్తుల కల్యాణి, గీసాల దుర్గాచంద్రరావు, గుత్తుల మల్లికార్జునరావు, కోర్ల కామేశ్వరరావు, నడిమింటి సూర్యప్రభాకరం, గేదెల రఘునాథబాబా, తోలేటి రాంబాబు, కుచ్చర్లపాటి చిట్టిరాజు, దాసరి గంగాధరరావు, మోకా రాంజీ, దూడల స్వామి, మోకా రాజు, బొంతు నాగరాజు, సత్యవాడ రామకృష్ణ, బీర శివ, సబ్బతి కిశోర్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అందిస్తోన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మహిళా వ్యాపారుస్తులతో నిర్వహించిన అవగాహనకార్యక్రమంలో ఆయనమాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యాపార సంస్థల ఏర్పాటుకు ముందు ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా పరిశ్రమలశాఖ డైరెక్టర్ ఎన్.అరుణ సూచించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు జయచంద్రగాంధీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిద్ధవి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నాయకులు నాగాబత్తుల సుబ్బారావు, మైపాల తాతాజీ, కొప్పినీడి ఈశ్వరరావు, దొమ్మేటి శ్యామ్, ఏపీఎంలు ఎం.వెంకటేశ్వరరావు, దుర్గానాగవేణి, పరిశ్రమల శాఖ అధికారులు ఏపీవీ మాధురి, వీరభద్రరావు, పీబీఎస్ దొర, మహిళలు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికలు టీడీపీ సంప్రదాయం


సూరిబాబురాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పార్టీ ఆవిర్భావం నుంచి ప్రతి రెండేళ్లకు సంస్థాగత ఎన్నికలు జరుపుకోవడం టీడీపీ సంప్రదాయమని ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. టీడీపీ ఐ.పోలవరం మండల కమిటీ ప్రమాణస్వీకారం బుధవారం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడిగా సాగిరాజు సూరిబాబురాజు, కార్యదర్శిగా బొంతు శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా ఉండ్రు నరసింహారావు ఎన్నికయ్యారు. రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు అధ్యక్షతన టీడీపీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. నూతన కమిటీని ప్రజాప్రతినిధులు అభినందించారు. తొలుత ఎన్టీఆర్, బాలయోగి, నడింపల్లి శ్రీనివాసరాజు విగ్రహాలకు పూలమాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, మందాల గంగసూర్యనారాయణ, గొలకోటి దొరబాబు, పొద్దోకు బాలు, కాకర్లపూడి రాజేష్, దాట్ల పృథ్వీరాజు, సొసైటీ అధ్యక్షుడు కాకర్లపూడి బుజ్జి, వాటర్ డీసీ చైర్మన్ చిలుకూరి సుబ్బరాజు, సొసైటీ చైర్మన్లు చిక్కాల శ్రీనివాస్, పెంట రవి, గాదిరాజు విశ్వనాధరాజు, ఎంఎస్ఎన్ రాజు, బీర సత్యకుమారి, ధూళిపూడి బాబి, అర్థాని శ్రీనివాసరావు, ముదునూరి రామలింగరాజు, టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, నీటి సంఘాల అధ్యక్షులు సాగిరాజు వాసురాజు, రాయపురెడ్డి స్వామినాయుడు, చెల్లి అశోక్, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, మద్దిరెడ్డి కుమార్, సాకా సీతాదేవి, చోడిశెట్టి బ్రహ్మానందం, జనసేన నాయకులు దేవు రాంబాబు, మల్లిపూడి రాజా పాల్గొన్నారు.

సొసైటీల్లో ఓటీఎస్ పద్ధతి అమలుచేయాలి

మామిడికుదురు, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):సొసైటీల్లో పేరుకుపోయిన బకాయిలు కోసం ఓటీఎస్ పద్ధతి అమలుచేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగిని కోరినట్టు నగరం సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఓటీఎస్ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అమలు జరిగేలా చూడాలని కోరినట్టు తెలిపారు.వర్ధినేని బాబ్జి, సాపే ఏకాదశి, కంచి విశ్వనాథం, పెచ్చెట్టి భాస్కరరావు, అప్పారి వెంకటేశ్వరరావు, నామన రాధాకృష్ణ పాల్గొన్నారు.

విజయభేతాళ ఉత్సవానికి శ్రీకారం

అంబాజీపేట,సెప్టెంబరు17(ఆంధ్ర జ్యోతి): విజయదశమి మహోత్సవాలను పురస్కరించుకుని అంబాజీపేట శ్రీనివాసనగర్‌లో ఉన్న శ్రీవిజయభేతాళస్వామి ఆలయం వద్ద పందిరి రాట ముహూర్తం నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 22న స్వామివారి కళస స్థాపన, అక్టోబరు 8న స్వామివారి ఉత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 13వాహనాలకు సంబంధించిన ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవకమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జునమోహనరావు, సంఘ అధ్యక్షుడు దొమ్మేటి రామారావు, మట్టపర్తి సోమేశ్వరరావు, వ్రితనాల శేఖర్, దొమ్మేటి సత్యమోహన్, చప్పిడి రామకృష్ణ, సాయికృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల యాజమాన్య నిర్లక్ష్య ధోరణికి నిరసన

అమలాపురం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఈదరపల్లిలోని విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని జేఏసీ చైర్మన్ మట్టపర్తి వెంకటరమణ పేర్కొన్నారు. ఉద్యోగులు ప్లకార్డులు చేతబూని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులర్ జేఎల్‌ఎంలుగా పరిగణించి వేతనాలు చెల్లించాలని వెంకటరమణ డిమాండ్ చేశారు. వివిధ యూనియన్ల నాయకులు సరెళ్ల సత్యనారాయణ, దంగేటి నరేంద్రకుమార్, వి.వెంకటేశ్వరరావు, బొంతు శ్రీనివాస్, ఐవీ సుబ్రహ్మణ్యం, ఈఎస్ ప్రసాద్‌కుమార్, ఏఈలు జీవీ ఆచార్యులు, బి.ఆనందరాజు, జేఈలు కె.నాంగేంద్ర, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

దొమ్మేటి వెంకటరెడ్డి స్మారక భవనం నిర్మించాలి

అమలాపురం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అమలాపురంలో శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు, దాత దొమ్మేటి వెంకటరెడ్డి పేరిట స్మారక భవనం నిర్మించాలని డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి పేర్కొన్నారు. పేరూరులో బుధవారం చంద్రమౌళి స్వగృహం వద్ద శెట్టిబలిజ సంఘ ప్రముఖులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతిపత్రం అందజేసి వెంకటరెడ్డి స్మారకభవనం నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈవిషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి సంఘీయుల కల సాకారం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆనందరావును సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో



ముమ్మిడివరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఎంపీడీవోగా జేఎల్ఎన్ దీక్షితులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన తాడి శ్రీవెంకటాచారి ఉద్యోగ విరమణ చేశారు. అమలాపురం పంచాయతీ రాజ్ ఆఫీసులో ఏవోగా పనిచేస్తున్న జేఎల్ఎన్ దీక్షితులు ఇక్కడకు ఎంపీడీవోగా వచ్చారు.

కాట్రేనికోన సచివాలయం ప్రారంభం


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

కాట్రేనికోన, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులు రూ.35లక్షలతో నిర్మించిన కాట్రేనికోన సచివాలయం(1) భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రారంభించారు. సచివాలయ భవనాన్ని సుందరంగా నిర్మించిన సర్పంచ్ గంటి వెంకటసుధాకర్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మండల ఇంజనీరింగు అధికారి మన్నే నరహరి, ఎంపీడీవో ఎస్.వెంకటాచలం, కార్యదర్శి జగడం సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు చెల్లి సురేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఆక్వా డైరెక్టర్ విత్తనాల నాగశ్రీనివాసరావు, వాసంశెట్టి రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, ఎంపీటీసీ మోకా నాగచంద్రరత్నం, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, సంసాని నాగేశ్వరరావు, సంగాని మునీంద్ర, వాసంశెట్టి శ్రీనివాస్, నల్లా హరికిశోర్, పీఎస్ఎన్ రాజు, జగడం బాలయోగి, నల్లా నరసింహమూర్తి, చల్లగల అప్పారావు, గుత్తుల సత్యనారాయణ, ప్రసాద్, నల్లా రాంబాబు, అయితాబత్తుల శ్రీనుబాబు, గిడ్ల శ్రీనివాసరావు, సుంకర పవిత్ర, నందిక శ్రీను పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ కాలం ఐదు సంవత్సరాల్లో జరగని అభివృద్ధి, సంవత్సర కాలంలోజరిగిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రసంగించారు. గత సంవత్సరం మండలంలో రూ.3కోట్ల ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా రహదారులు నిర్మించుకుని ప్రస్తుత సంవత్సరం రూ.5కోట్ల నిధులతో రహదారులు నిర్మించామన్నారు. తొత్తరమూడి-కె.జగన్నాథపురం రహదారికి రూ.3కోట్లు మంజూరైందని, త్వరలో పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యేతెలిపారు. వ్యవసాయాధికారి వై.శోభ మాట్లాడుతూ మండలంలో యూరియా కొరతలేదని, 6వేలమెట్రిక్ టన్నుల యూరియా ఉందన్నారు. పలువురు అధికారులు ఆయాశాఖల పనితీరును వివరించారు. జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి, డిప్యూటీ ఎంపీడీవో వాణిబెహరా, సర్పంచ్‌లు కాకర శ్రీనివాస్, మేడిద దుర్గాప్రసాద్, సలాది బుచ్చిరాజు, వారా జయసావిత్రి, కోనే సునీతసుబ్బలక్ష్మి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కాకర శ్రీనివాస్,అధికారులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సామాజిక వర్గానికి సముచితస్థానం


నారాయణమూర్తిని సన్మానిస్తున్న డొక్కా నాథ్‌బాబు

పి.గన్నవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే బ్రాహ్మణ సామాజిక వర్గానికి సముచిత స్థానం లభించిందని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ల నారాయణమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు అన్నారు. లంకలగన్నవరం విచ్చేసిన నారాయణమూర్తిని నాథ్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం బ్రాహ్మణ సామాజిక వర్గీయుల సమక్షంలో దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోయే కాలంలో బ్రాహ్మణ సామాజికవర్గం కూటమి పార్టీలకే అండగా నిలవాలని, 2029ఎన్నికల్లో కూటమి గెలుపునకు విశేష కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో గోర్తి పవన్, అక్కిరాజు రాంబాబు, కొల్లూరి శివ, ముష్టి రాజేశ్వరశర్మ, గోవిందవర్ఝల నాగబాబు, గంటి శ్రీరామూర్తి, శిష్టామూర్తి పాల్గొన్నారు.

రూ.4కోట్ల రహదారుల పనులకు శంకుస్థాపన

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోని చల్లపల్లి-వాసాలతిప్ప, ఉప్పలగుప్తం- పేరాయిచెరువు ప్రధాన రహదారులకు కూటమి పాలనలో విముక్తి లభించింది. ఉప్పలగుప్తం ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి పేరాయిచెరువు వరకు రూ.3కోట్ల నాబార్డు నిధులతో నిర్మించే రహదారికి బుధవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపన చేశారు. అమలాపురం- ఎస్.యానాం ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి వాసాలతిప్ప తీరప్రాంత గ్రామానికి రూ.కోటితో రహదారి ఆధునికీకరణకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమాల్లో సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, ఇసుకపట్ల జయమణీరఘుబాబు, రాష్ట్ర ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యానాం మరింత అభివృద్ధి: మల్లాడి


సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో అందరూ కలిసి కట్టుగా వెళ్లితేనే యానానికి మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. మల్లాడి అభిమాన సంఘ ఆధ్వర్యంలో మల్లాడి కృష్ణారావు, సతీమణి ఉదయలక్ష్మి దంపతుల 42వ వివాహ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక యర్రాగార్డెన్స్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మల్లాడి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం మల్లాడి కృష్ణారావు, ఉదయలక్ష్మి దంపతులు, తనయుడు రఘువంశీ, కోడలు అనుపమా, మనవరాలు అభిమాన సంఘ ఏర్పాటుచేసిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం మల్లాడి దంపతులను గురుదత్త బ్రాహ్మణ సేవాసమితి సభ్యులు ఆశీర్వదించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించిమల్లాడి మాట్లాడారు.రానున్న రోజుల్లో యానాం ప్రజలు, కార్యకర్తలు నేను అనుకున్నది మీరు చేయండి.. మీరు అనుకున్నది నేనుచేసి చూపిస్తానన్నారు. నా ఎదుగుదలకు నాయకులు, ప్రజలే కారణమన్నారు. అనంతరం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మత్స్యకార నాయకులు, యానానికి చెందిన నాయకులు, మహిళలు, వివిధ సంఘాల ప్రతినిధులు మల్లాడిని ఘనంగా సత్కరించారు.

ముమ్మిడివరంలో యూటీఎఫ్ రణభేరి జాత

ముమ్మిడివరం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ చేపట్టిన రణభేరి జాత బుధవారం రాత్రి ముమ్మిడివరం చేరుకుంది. తుని నుంచి జరుగుతున్న ఈ జాత తాళ్లరేవు, ఐ.పోలవరం మీదుగా ముమ్మిడివరం చేరుకుంది. ఈసందర్భంగా ముమ్మిడివరం లంకలమ్మ గుడిసెంటర్లో గాంధీ విగ్రహానికి యూటీఎఫ్ నాయకులు నివాళులర్పించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం అవలంబించిన విధానాలను వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులంతా ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో పోరుబాట చేపట్టామన్నారు.ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని, డీఏబకాయిలు విడుదల చేయాలన్నారు. అనంతరం అమలాపురం వైపు జాతా సాగింది.

ఎంపీ సతీష్‌కు ఏఎంసీ చైర్మన్ కేతా కృతజ్ఞతలు




రాజోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌ను బుధవారం రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్‌గా తన నియామకానికి కృషిచేసినందుకు సతీష్‌కు ఆమె పుష్పగుచ్ఛంఅందజేసి దుశ్శాలువాకప్పి పూలమాలలతో సన్మానించారు. భైరిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా

రాజోలు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా రాజోలు నియోజకవర్గాయన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడలి శ్రీదుర్గ అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మంజూరైన రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సమస్యలు తెలియచేయడానికి ట్రాన్స్‌కో రాజోలు ఏఈకి ఫోన్ చేస్తే స్పందించడం లేదని జడ్పీటీసీ మట్టా శైలజ ట్రాన్స్‌కో ఏఈని ప్రశ్నించారు. మండలంలో యూరియా కొరత లేదని, 57టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారి వై.మధుకుమార్ తెలిపారు. ప్రజాప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానమిచ్చారు. తొలుత దివంగత ఎంపీపీ కేతా శ్రీను చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, వైస్‌ఎంపీపీలు ఇంటిపల్లి ఆనందరావు, పొలమూరి శ్యామ్‌బాబు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

బాలబాలాజీ దేవస్థానం మాజీ చైర్మన్ మృతి



మామిడికుదురు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామానికి చెందిన అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం మాజీ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ (60) అనారోగ్యంతో ఆకస్మికంగా బుధవారం మరణించారు. ఆయన బాలబాలాజీ చైర్మన్‌గా, నగరం సొసైటీ చైర్మన్‌గా, శెట్టిబలిజ సంఘ నాయకుడిగా సేవలు అందించారు. ఆయన మృతి పట్ల శెట్టిబలిజ మండల సంఘంతో పాటు పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

అధ్వాన రోడ్డుకు మోక్షం

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను సత్కరించిన స్థానికులు

అంబాజీపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): 20ఏళ్లుగా ఆ రహదారిపై ప్రయాణించడానికి విద్యార్థులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ రహదారి నిర్మాణానికి చర్యలుతీసుకుంటానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో రహదారికి ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా రూ.1.10కోట్లు మంజూరు చేయించారు. భేతాళస్వామి ఆలయం నుంచి చప్పిడివారిపాలెం, నందెపువారిపాలెం, కోశివారిఅగ్రహారం, కుమ్మరివారిపాలెం మీదుగా ఈరహదారిని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను స్థానికులు కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. నాగాబత్తుల సుబ్బారావు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, కొప్పినీడి ఈశ్వరరావు, జయంతి శ్రీరామచంద్రమూర్తి, ఆదుర్తి నారాయణమూర్తి, యాగన రాము, చప్పిడి రామకృష్ణ, చప్పిడి రాంబాబు, మట్టపర్తి వెంకటేశ్వరరావ పాల్గొన్నారు.

ఐ.పోలవరం- కేశనకుర్రు రోడ్డు ఆధునికీకరణ

ఐ.పోలవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రూ.1.38కోట్లతో ఆధునికీకరించే ఐ.పోలవరం- కేశనకుర్రు రోడ్డుకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు బుధవారం భూమిపూజ చేశారు. నియోజకవర్గంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆయన అన్నారు. సీఎంసహాయనిధి నుంచి మంజూరైన 27.32 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 44మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ రాజశేఖర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, సాగిరాజు సూరిబాబురాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, కాకర్లపూడి రాజేష్, సొసైటీ అధ్యక్షుడు కాకర్లపూడి బుజ్జి, నీటిసంఘం చైర్మన్ రాయపురెడ్డి స్వామినాయుడు, సొసైటీ డైరెక్టర్ మద్దిరెడ్డి కుమార్, పిల్లా గోపి, రాయపురెడ్డి బ్రహ్మానందం, దంగుడుబియ్యం మోహన్, బొంతు ప్రసాద్‌పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 560వైద్య శిబిరాలు

అంబాజీపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 560 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.దుర్గారావుదొర అన్నారు. గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఆరోగ్య వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. బుధవారం నుంచి ప్రారంభమైన వైద్య శిబిరాలు అక్టోబరు 2వరకు ప్రతి నియోజకవర్గంలో జరుగుతాయన్నారు. ప్రతి వైద్య శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

ఘనంగా ముహూర్తపు రాట


వెదురుపాకలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గాపీఠంలో 54వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాట ముహూర్తపు పూజలను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పీఠం వేదపండితుడు చిమలకొండ వీరావధాని, అర్చకుడు కే.శివ అర్చకత్వంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో గాడ్ కుమార్తె గాదే సత్యవెంకటకామేశ్వరి, భాస్కర నారాయణ దంపతులు చేతులమీదుగా ఉదయం 9:46 గంటలకు వినాయకపూజ, పుణ్యవచనం, రక్షాబంధనం, విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు హారతులు నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి), గాదే చిన్నకృష్ణంరాజు, భక్తులు పాల్గొన్నారు.

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు


శివలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది

కె.గంగవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అనారోగ్యం ఉన్నవారిని గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందించాలని యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్ అన్నారు. బుధవారం శివలలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ ఆమని, ఎంపీహెచ్ఎస్ గుడాల శ్రీమన్నారాయణ కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పలురకాలు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో పద్మేష్‌బాబు, కూటమి నాయకులు బలుసు శివప్రసాద్, ఎంపీటీసీ నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యాంబ, అంగన్ వాడీ టీచర్ వీరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీన్ని గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భం గా పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మహిళలకు వైద్యపరీక్షలు, రక్తపోటు, మధుమేహం క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణులకు ప్రసూతి సంబంధిత పరీక్షలు, రక్తహీనత, క్షయ, సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామారావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, వంటనూనెలు 10 శాతం తగ్గించడం ద్వారా ఊబకాయాన్ని తగ్గించడం, ప్రాంతీయ ఆహారాన్ని ప్రోత్సహించడం, బాల్యసంరక్షణ, చిన్నారుల ఆహార పద్ధతులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, కూటమి నాయకులు పుత్సల శ్రీనివాస్, త్రిపురశెట్టి నాని, పిల్లా బసవరాజు, దానేటి శరత్, తోరం రాము, కార్యదర్శి మోహన్, వార్డు సభ్యులు, హెచ్ఎస్ నాని బాబు, హెచ్‌వీ మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.


అంగరలో మాట్లాడుతున్న ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు

మసకపల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరం

కె.గంగవరం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మసకపల్లిలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని జనమిత్ర మండలి అధ్యక్షుడు రవ్వా భూషణం, కపిలేశ్వరపురం ఎల్‌వీప్రసాద్ నేత్రవైద్యశాల వారు సంయుక్తంగా ఏర్పాటు చేశారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. శిబిరంలో 78 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. ఇందులో పది మందికి క్యాట్‌రాట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి ఆసుపత్రికి తరలించారు. అలాగే 20 మందికి కళ్లద్దాలు అందించారు. డాక్టర్ పద్మ, విజయ్ సునంద్, నగేష్, కొండలరావు, వెంకటేష్, రవి, దుర్గాప్రసాద్ పాల్గొని వైద్యసేవలు అందించారు. కూటమి నాయకులు సొసైటీ అధ్యక్షుడు గెడ్డం బన్నీ, కొమ్మన పండు, చిల్లి నాగేశ్వరరావు, నామాడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు మ్యూజిక్‌థెరపీ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగ చిన్నారులకు మ్యూజిక్ థెరపీ ద్వారా విద్యాబోధన చేశారు. ఐఈఆర్‌టీ సునీత మాట్లాడుతూ వీళ్లంతా సీడబ్ల్యుఎస్ఎన్ (చిల్డ్రన్ విత్‌స్పెషల్ నీడ్స్) కాబట్టి వాళ్లకి స్టడీ అనేది బ్లాక్ బోర్డు వెర్బింగ్ అయితే అంత ఎఫెక్టెడ్‌గా నేర్చుకోలేరన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు



మండపేటలో వేడుకలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

మండపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను బీజేపీ శ్రేణులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాళం ఫణిప్రకాష్, నియోజకవర్గ ఇన్‌చార్జి కె.సాయిరాం సారథ్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అలాగే పట్టణంలో వున్న అన్నక్యాంటీన్‌లో 400 మందికి భోజనాలు పెట్టారు. ద్వారపూడిలో బీజేపీ నేత మురళీకృష్ణ నేతృత్వంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కె.సత్యనారాయణ చాత్రాతి రాంబాబు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: ప్రధాని మోదీ 75వ పుట్టిన రోజు వేడుకలను కోటిపల్లిలో బుధవారం కూటమి నాయకులంతా కలిసి ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు అధ్యక్షతన పార్టీ అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరై మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కూటమి నేతలు ఏ.నారాయణ మూర్తి, సలాది రామకృష్ణ, గుర్రాల సత్యనారాయణ, నున్న సత్యనారాయణ, పల్లి కిరణ్‌కుమార్, తాళ్ల మూసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: రాయవరంలో ప్రధాని మోదీ 75వ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు శాకా దుర్గాశ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాత్రాతి జానకిరాంబాబు, కొత్తపల్లి శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత ప్రధానికే దక్కుతోందన్నారు. అనంతరం స్థానిక చాణక్య హాస్పటల్‌లో రోగులకు, గ్రామంలో పేదలకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు, పిల్లి సత్యనారాయణ, శాకా ధనుంజయ, కరుటూరి శ్రీనివాస్, అంగర జనార్దన్, కేవీవీ సత్యనారాయణ, నరాల వెంకట సాయి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర గాంధీ సెంటర్‌లో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు తోరం రాము, ఓబీసీ సెల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సూరంపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు నామాల శ్రీనివాస్, చిట్టిబాబు, బీజేపీ నేతలు, కార్యకర్తలు, పలువురు కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


అంగరలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు


కోటిపల్లిలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు


రాయవరంలో రోగులకు పండ్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు

రెండోరోజూ కొనసాగిన క్రీడా పోటీలు

రాయవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ - 14, అండర్-17 బాలిక విభాగంలో క్రీడా పోటీలు రెండోరోజైన బుధవారమూ కొనసాగాయి. ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. క్రీడా పోటీలను తిలకించిన ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, హెచ్ఎం వీ.శాంతి సునీత, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా నానో ఎరువులు వాడండి

● ఏడీఏ బీ.నాగకుమార్

కె.గంగవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరి పండించే రైతులు రసాయన ఎరువులకు బదులుగా నానో, జీవన ఎరువులు ఉపయోగించి పెట్టుబడులు తగ్గించుకోవాలని వ్యవసాయశాఖ రామచంద్రపురం ఏడీఏ బీ.నాగకుమార్ అన్నారు. బుధవారం కూళ్ల, యండగండిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏవో సద్గురు మూర్తి మాట్లాడుతూ ఈనెలాఖరు నాటికి రైతులు పంట నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కూళ్ల సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, వీఏఏలు భూషణం, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే


మండపేటలో డ్వాక్రాబజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో స్థానిక రథం గుడి వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చేతిసంచులు, స్టీల్ వాటర్ బాటిల్స్ జ్యూట్ బ్యాగ్‌లను విక్రయించే కేంద్రాన్ని ఏర్పాటుచేయటం ద్వారా మహిళలు అన్నిరంగాల్లో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మండపల్లి చంద్రశేఖర్, బీజేపీ నాయకుడు కె.సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, పీ.సుజాత, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు రైల్వేగేటు మూసివేత


జెడ్. మేడపాడులో రైల్వేగేటు మూసి ఉన్న దృశ్యం

మండపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలం జెడ్.మేడపాడు వద్ద వున్న రైల్వేగేటును రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈనెల 19వ తేదీ నుంచి 23 వరకు మూసివేస్తున్నట్టు సామర్లకోట రైల్వే సెక్షన్ అధికారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులు, వాహనదారులు సహకరించాలని ఆయన కోరారు. ప్రత్యామ్నాయంగా సమీపంలో వున్న ద్వారపూడి ఫ్లైఓవర్‌పై నుంచి ప్రయాణించవచ్చని సూచించారు.


తిరుమల వెంకటేశ్వరుడి దర్శన అనంతరం మంత్రి సుభాష్, యానాం ఎమ్మెల్యే అశోక్

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకటేశ్వర స్వామిని మంత్రి సుభాష్ బుధవారం దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. మంత్రితోపాటు యానాం ఎమ్మెల్యే అశోక్, టీడీపీ నాయకులు గంధం పళ్లంరాజు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై ఏడుకొండల వారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు.

రావులపాలెం ఎంపీడీవోగా సుబ్రహ్మణ్యం



రావులపాలెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఎంపీడీవోగా సీహెచ్ సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన మహేశ్వరరావు పదోన్నతిపై వచ్చి బదిలీపై వెళ్లడంతో ఎంపీడీవో పోస్టుకు ఉన్నతాధికారులకు సుబ్రహ్మణ్యాన్ని నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

జొన్నాడ వద్ద వాహనాల తనిఖీ


జొన్నాడ ఏటిగట్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ విద్యాసాగర్

ఆలమూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ వద్ద ఏటిగట్టుపై వెళ్లే వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ అధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఏటిగట్టుపై ప్రయాణించే 25వాహనాలను తనిఖీలు చేసి రికార్డులు సక్రమంగాలేని వారివద్ద నుంచి రూ.10వేల అపరాధ రుసుం వసూలు చేసినట్లు వారు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

భారీ అన్నసమారాధన

ఆత్రేయపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ర్యాలి గుడిమెరక వీధిలో బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక చవితి వేడుకల్లో నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే బండారు


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీచేసిన ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పేద వారికి సైతం కార్పొరేట్ వైద్యం అందించి వారి ఆరోగ్యం మెరుగ్గా ఉండాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపుపార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కొత్త పేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన 40మందికి రూ.19.64 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 నెలల్లో 19 విడుతలుగా 474 మందికి రూ.3.70కోట్లు సీఎం సహాయనిధి చెక్కులను అందించామన్నారు.

అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు శాట్ పరీక్ష


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎంవో రాంబాబు

ద్రాక్షారామ, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను గుర్తించి తదనుగుణంగా విద్యాబోధన చేపట్టేందుకుగాను స్కిల్ ఎనాలసిస్ టెస్ట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్షా అభియాన్ ఏఎంవో పిల్లి రాంబాబు అన్నారు. బుధవారం ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శాట్ పరీక్ష కేంద్రాన్ని ఏఎంవో రాంబాబు పరిశీలించారు. పరీక్షల ఏర్పాట్ల గురించి హెచ్ఎం పి.శేఖర్ ఏఎంవోకు వివరించారు. సెల్ఫ్ అసెస్‌మెంటు 1 పరీక్షలో 10మార్కుల కంటే తక్కువ పొందిన విద్యార్థులకు శాట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం తెలుగు, గణితంకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 11628 మందికి పరీక్ష నిర్వహించామన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మిగిలిన వారితో సమానంగా చదివించడానికి ఈ పరీక్ష ఉపకరిస్తుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా విన్నూత్నంగా ఆలోచించి ప్రయోగాత్మకంగా ఈ పరీక్ష నిర్వహిస్తున్నారని ప్రభుత్వ పరీక్షల విభాగం కన్వీనర్ బి.హనుమంతరావు తెలిపారు.

'ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కృత్తివెంటి కళాశాలగా నామకరణం చేయాలి'


సమావేశమైన కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు ధర్మకర్తల మండలి

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి):పట్టణంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన స్థలం లో నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కృత్తివెంటి పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాలగా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ట్రస్టు ధర్మకర్తల మండలి తీర్మానించింది. బుధవారం ధర్మకర్తల మండలి సమావేశంలో చైర్మన్ సలాది నాయుడు మాస్టారు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడాప్రాంగణం పట్టణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని మౌళిక వసతులు లైటింగ్, పారిశుధ్యపనులు నిర్వహించేందుకు పురపాలక సంఘం సహకరించాలని కోరుతూ తీర్మానించారు. అదే విధంగా కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు ధర్మకర్తలుగా నియామకానికి సహకరించిన మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ధర్మకర్తలు మార్ని సుబ్బారావు, నరాల సురేష్, కొండపల్లి రవికుమార్, ఈవో సి.హెచ్.ఎస్ సత్యనారాయణపాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ

ఆలమూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ నారీ శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం బుధవారం ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీలో ఎంపీడీవో ఎ.రాజు ప్రారంభించారు. మహిళల ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈకార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది ప్రచారం నిర్వహించారు. మహిళలలో సాధారణంగా వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించి వాటికి సరైన వైద్యం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సాయికిషోర్, భాగ్యశ్రీ, సర్పంచ్ మోహర్‌సత్యశ్రీ, ఎంఈవో అప్పాజీ, నాయకులు గారపాటి శ్రీనివాసరావు, నెక్కంటి సూర్యప్రకాశరావు, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ 75వ జన్మదిన వేడుకలు




రామచంద్రపురంలో, రావులపాలెంలోని ఈతకోటలో మోదీ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం, కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి):ప్రధాని మోదీ జన్మది వేడుకలు రామచంద్రపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు దునే శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ జెండా స్థూపం వద్ద మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మోదీ సుపరిపాలన వివరిస్తూ పట్టణంలో బైక్, ప్రచారరథంతో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో కూటమి నాయకులు కేకు కట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేశవ రాఘవేంద్రరావు, గానాల కల్యాణ్, కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్‌నాయుడు, యాండ్ర బుల్లబ్బులు, కృష్ణమూర్తి, కొప్పిశెట్టి శ్రీను, గొర్రెల శ్రీను, కులపాకుల వెంకటరమణ, కొనపాల గణేష్, రాయుడు మణికంఠ పాల్గొన్నారు.

ద్రాక్షారామ,(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు బుధవారం ద్రాక్షారామలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో కేకు కట్ చేశారు. ప్రధానిమోదీకి శుభాకాంక్షలు తెలిపారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో సేవా పక్వడ కార్యక్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ద్రాక్షారామ పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బోసుబొమ్మసెంటర్‌లో స్వచ్ఛత అభియాన్‌కార్యక్రమం లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కర్రి చిట్టిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు వాడ్రేవు వెంకట్రావు, కె.గంగవరం మండల బీజేపీ అధ్యక్షుడు చందు, గుర్రాల సత్యనారాయణ, పెయ్యల రాంబాబు, సలాది సతీష్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, ద్రాక్షారామ పీఏసీ ఎస్ త్రిమేన్ కమిటీ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, ఆళ్లబుజ్జి తదితరులు పాల్గొన్నారు.


ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈతకోటలో బీజేపీ నేత గండ్రోతు వీరగోవింద్ ఆధ్వర్యంలో మోదీ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి చిన్నారులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు బీజేపీ మండల కన్వీనర్ కోటపల్లి దామోదర్ ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు సంపతి కనకేశ్వరరావు, పాలూరి జయప్రకాశ్‌నారాయణ, భమిడిపాటి లక్ష్మినారాయణ, గొలకోటి వెంకటేశ్వరరావు, కుడుపూడి దావీద్‌రాజు, కోటపల్లి సుబ్రహ్మణ్యం, పాలాటి మాధవస్వామి, అన్యం సత్యనారాయణ, ప్రసాదరాజు పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఆలమూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. కొత్తపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి శ్రీరాములు, మండల ప్రధాన కార్యదర్శి సిద్దిరెడ్డి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మోదీ జన్మదిన కేక్‌లను కట్ చేశారు. అనంతరం ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

విద్యేతర పనులతో విద్యార్థులకు ఇబ్బందులు

రావులపాలెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు విద్యార్థులకు బోధనతోపాటు విద్యేతర పనులు చెబుతుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు నెలకొంటాయని జిల్లా ఎస్టీయూ మాజీ అధ్యక్షుడు కేవీ శేఖర్ అన్నారు. దేవరపల్లి జడ్పీ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాబోధనకు నియమించిన ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలో పాఠాలు చెప్పేలా ఉండాలని అధికారులను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు కె.కింగ్, ప్రధాన కార్యదర్శి ఏ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్టీయూ మాజీ అధ్యక్షుడు శేఖర్

'మంత్రి సుభాష్‌పై అక్కసుతోనే అసత్యప్రచారం'

ద్రాక్షారామ,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మంత్రి సుభాష్‌పై అక్కసుతోనే అసత్యప్రచారం చేస్తున్నారని రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ద్రాక్షారామలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టరు పెంకె అన్నపూర్ణ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మేడిశెట్టి రవికుమార్, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంకె సాంబశివరావు తదితరులు మాట్లాడారు. శెట్టిబలిజల కుల ధ్రువీకరణ పత్రం విషయంలో గతంలో వైసీపీ హయాంలో జరిగిన తప్పులు సవరిస్తూ మంత్రి సుభాష్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారని తెలిపారు. ఈ విషయంపై అవగాహన లేకుండా వైసీపీ నాయకులు కుల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో శెట్టిబలిజ సామాజిక వర్గాన్ని ఓసీలో చేరుస్తున్నారని వైసీపీ నాయకులు కొందరు దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.